సాక్షి
అనకాపల్లి
బుధవారం । 16 । జూలై । 2025



## ముగిసిన వీఆర్ఎస్ గడువు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన వీఆర్ఎస్ గడువు మంగళవారంతో ముగిసింది. 1200 మంది ఉద్యోగులు దరఖాస్తు చేశారు.



## భారత రాజ్యాంగం సమగ్రం

సబ్బవరం: భారత రాజ్యాంగం విభిన్నమైనదని, ఎంతో సమగ్రమైనదని డీఎస్ఎన్ఎల్ వర్సిటీ వ్యవస్థాపక వీసీ ఆచార్య వై.సత్యనారాయణ తెలిపారు.

## వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి, తేలికపాటి వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం తెలిపారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 36.9 నుంచి 37.8 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 28.0 నుంచి 28.7 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

## న్యూస్‌రీల్

### డీఈవో ఆకస్మిక తనిఖీ

- జంపపాలెం హెచ్ఎంకు షోకాజ్ నోటీస్



జంపపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పాఠ్యాంశాల పురోగతిపై ఆరా తీస్తున్న డీఈవో అప్పారావునాయుడు

యలమంచిలి రూరల్: జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు మంగళవారం యలమంచిలి మండలంలో జంపపాలెం, సోమలింగపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల హాజరు పరిశీలించారు. జంపపాలెం ప్రధానోపాధ్యాయిని ఎ.విజయకుమారి ఆన్‌లైన్‌లో సెలవు నమోదు చేయకపోవడంతో ఆమెకు షోకాజ్ నోటీస్ జారీ చేశారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తరగతికి వెళ్లి పాఠ్యాంశాల పురోగతిపై ఆరా తీశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. కాలనిర్ణయ పట్టిక, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్లు, విద్యార్థుల నోట్ పుస్తకాల మూల్యాంకనం వంటివి సక్రమంగా చేస్తున్నారో.. లేదో? తనిఖీ చేశారు. అనంతరం సోమలింగపాలెం ఉన్నత పాఠశాలలో తనిఖీకి వెళ్లిన డీఈవో అక్కడ మధ్యాహ్న భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం రుచి చూశారు. టెన్త్‌లో ఉత్తీర్ణతాశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ఇప్పట్నుంచే వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఉపాధ్యాయుడు రత్నరాజు ఆర్థిక సహకారంతో 8వ తరగతి విద్యార్థులకు సమకూర్చిన ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను ఆయన విద్యార్థులకు పంపిణీ చేశారు.

### 'మిషన్ వాత్సల్య'లో విద్యార్థులకు రెండేళ్ల ఆర్థిక సాయం

- జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి



సింగన్నదొరపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

కె.కోటపాడు: మిషన్ వాత్సల్య పథకంలో 18 సంవత్సరాలలోపు విద్యార్థులకు రెండేళ్లపాటు ఆర్థిక సాయం అందచేస్తున్నామని జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ పీడీ సూర్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మండలంలో సింగన్నదొరపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రీ స్కూలు, గ్రోత్ మానిటరింగ్, మెడిసిన్ కిట్స్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో మాట్లాడారు. 18 సంవత్సరాల వయస్సు వరకు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్లి, మళ్లీ పాఠశాల నుంచి ఇంటికి వచ్చే విద్యార్థులకు మాత్రమే నెలకు రూ.4,000 వంతున సహాయం అందిస్తున్నామన్నారు. పోషకాహారం, రవాణా ఖర్చులు, ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ సహాయం అందిస్తున్నామని చెప్పారు. మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లాకు 2024-2025 ఆర్థిక సంవత్సరంలో కోటి 42 లక్షల 38 వేల రూపాయలు మంజూరయ్యాయన్నారు. తొలి విడతగా 332 మంది విద్యార్థుల ఖాతాలో సొమ్ము జమ చేశామన్నారు. మలివిడత మరో 408 మంది విద్యార్థుల బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేయనున్నట్లు చెప్పారు. పీడీ వెంట స్థానిక సీడీపీవో లలితాకుమారి ఉన్నారు.

### విత్తన శుద్ధి యూనిట్ తనిఖీ



తంగేడులో విత్తన శుద్ధి యూనిట్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

కోటవురట్ల: విత్తన శుద్ధి పరికరాలు, యంత్రాలు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షణ ఉండాలని జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి మహారాజన్ సూచించారు. తంగేడు కాటా వద్ద ఉన్న విత్తన శుద్ధి యూనిట్‌ను గుంటూరు కమిషనర్ ఆఫ్ అగ్రికల్చర్ ఆదేశాలతో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, విత్తన శుద్ధి చేసిన ధాన్యం, యంత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలన్నారు. విత్తన శుద్ధిలో నాణ్యతా లోపాలు లేకుండా చూడాలని సూచించారు. పర్యవేక్షణ లేకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి సింహాచలం, జిల్లా వ్యవసాయ క్వాలిటీ ఇన్‌స్పెక్టర్ సరోజిని, పాయకరావుపేట వ్యవసాయ సహాయ సంచాలకుడు ఉమాప్రసాద్, ఏవో సరోజిని, యూనిట్ యజమాని శివ పాల్గొన్నారు.



చెట్టునుంటే కొమ్మ.. కళాకారుడు చెక్కితే బొమ్మ.. ఆ బొమ్మకు ప్రాణం పోస్తే.. అది ఏటికొప్పాక లక్క బొమ్మ. అవును.. ఈ బొమ్మల్లో జీవ కళ ఉట్టిపడుతుంది. అవి మనల్ని పలకరిస్తాయి. కబుర్లు చెబుతాయి. ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. పిల్లల్నే కాదు పెద్దల్నీ ఆకట్టుకుంటాయి. దేశీయంగానే కాదు అంతర్జాతీయంగానూ ఖ్యాతి గడిస్తాయి. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును, ప్రధాని మోదీలను సైతం మంత్రముగ్ధులను చేశాయి. అందుకనే ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' ఎంపిక కావడమే కాదు జాతీయ స్థాయిలో అవార్డును అందుకున్నాయి.

# బొమ్మను చేసి.. ప్రాణం పోసి..



ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

- ఖండాంతరాలు దాటిన ఏటికొప్పాక లక్కబొమ్మల ఖ్యాతి
- 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి'లో జాతీయ స్థాయి అవార్డు
- ఢిల్లీలో పురస్కారం అందుకున్న కలెక్టర్ విజయ కృష్ణన్





ఏటికొప్పాక బొమ్మలు



పొంగల్ సెట్

సాక్షి, అనకాపల్లి:

ప్రతి జిల్లాకు ప్రత్యేకతగా నిలిచే ఉత్పత్తులను గుర్తించి వాటిని ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' కార్యక్రమాన్ని ప్రారంభించింది. స్థానికంగా ఉత్పత్తుల తయారీని, ఎగుమతులను పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని నిర్ణయించింది. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో పోటీ పడేలా అవసరమైన సాంకేతిక సహాయం అందిస్తుంది. ఇందులో భాగంగా ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి ఏటికొప్పాక హస్తకళకు అవకాశం లభించింది. 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి'లో మంచి ఫలితాలు సాధించడంతో జాతీయ స్థాయిలో అవార్డు దక్కింది. న్యూఢిల్లీలోని ప్రగతి మైదానంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, ఢిల్లీ సీఎం రేఖాగుప్తాల చేతుల మీదుగా అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అవార్డును అందుకున్నారు.



**అవార్డులు కొత్త కాదు**

గతంలో కూడా ఏటికొప్పాక బొమ్మలకు జాతీయ, అంతర్జాతీయ గుర్తింపుతోపాటు కళాకారుడు సీవీ రాజుకు పద్మశ్రీ పురస్కారం లభించింది. విశాఖకు చెందిన ప్రొఫెసర్ బొగాది నీలిమ అనే యువతి ఏటికొప్పాక హస్తకళా నైపుణ్యంపై 'సాగా ఆఫ్ ది విమెన్' పేరిట డాక్యుమెంటరీ తీసి, ప్రపంచంలో రెండో స్థానం కైవసం చేసుకున్నారు. ఇటీవల గతేడాది జూన్ నెలలో కర్నూల్‌లో ఏర్పాటు చేసిన లేపాక్షి హస్తకళల ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఈ బొమ్మలు నిలిచాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థల ఆన్‌లైన్ అమ్మకాలతో లక్కబొమ్మలు అంతర్జాతీయ ఖ్యాతి నార్జించాయి. దేశ ప్రధాని సైతం 'మన్ కీ బాత్'లో లక్కబొమ్మల విశిష్టత గురించి ప్రస్తావించారు. సహజసిద్ధమైన రంగులతో ప్రయోగాలు చేసి ఏటికొప్పాక బొమ్మకి కొత్త కళను తెచ్చినందుకు సీవీ రాజుకి 2002లో రాష్ట్రపతి అవార్డు, 2012లో నేషనల్ ఇన్నోవేషన్ అవార్డు లభించాయి. అదేవిధంగా ఏటికొప్పాకకు చెందిన మరో కళాకారుడు శ్రీశైలపు చిన్నయాచారి.. మైక్రో ఆర్ట్స్ చేయడంలో నిపుణుడు. ఆయనకు 2003లో జాతీయ హస్తకళల పోటీలో ప్రథమ బహుమతి లభించింది. అలాగే బియ్యపు గింజ మీద పట్టేంత వీణ, గుండుసూది మీద పట్టేంత తాజ్‌మహల్, ఏనుగు, బుద్ధుడు, ఎడ్ల బండి, శ్రీరామపట్టాభిషేకం, 5.5 మిమీ పరిమాణంలో తయారుచేసిన అతి చిన్న చెస్ బోర్డు, తల వెంట్రుక మీద నిలబెట్టగలిగే పక్షులు... ఇలా అనేక మీనియేచర్ ఆర్టులను ఆయన తయారు చేశారు. ఇలా రంగులీనుతూ కనిపించే ఈ బొమ్మల వెనుక కళాకారుల సృజనాత్మకత మనల్ని కట్టిపడేస్తుంది.



**ఎల్లలు దాటిన ఖ్యాతి**

ఏటికొప్పాక బొమ్మలు దేశ, విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి. అమెరికా, శ్రీలంక, ఆస్ట్రేలియా, పోలెండ్, హాలెండ్, స్విట్జర్లాండ్, నేపాల్, బ్రిటన్, జర్మనీ వంటి విదేశాలతో పాటు ఢిల్లీ, చెన్నై, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరు, హైదరాబాద్, భువనేశ్వర్, రాజస్థాన్, పాట్నా, విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ నగరాలకు ఎగుమతి అవుతున్నాయి. కుంకుమ భరిణీలు, నూనెలు, ఆభరణాలు దాచుకునే డబ్బాలు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, మహిళలు ధరించే గాజులు, కీ చైన్లు, ఫ్లవర్‌వాజ్‌లు, రైలు బండ్లు, ద్విచక్రవాహనాలు, దేవతామూర్తుల బొమ్మలు మొదలుకుని గ్రామీణ వాతావరణం, తిరుపతి వెంకన్న ఫోటోలు, రామాంజనేయ యుద్ధ సన్నివేశాలు, పెళ్లి తంతు, పెళ్లి సారె, రిస్ట్ వాచీలు వంటివి కళా ప్రియులను మంత్రముగ్ధులను చేస్తాయి.



## కదలిన అధికార యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

- తల్లి, బిడ్డ ఆరోగ్యంపై ఆరా తీసిన జిల్లా వైద్యాధికారి డా.హైమావతి



నర్సీపట్నం ఆస్పత్రిలో గిరిజన బాలింతను పరామర్శిస్తున్న డీఎంహెచ్‌వో హైమావతి

నర్సీపట్నం: ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అర్ల గ్రామానికి చెందిన గిరిజన బాలింతను జిల్లా వైద్యాధికారి డాక్టర్ హైమావతి మంగళవారం కలిశారు. సాక్షిలో వచ్చిన 'నిండు గర్భిణికి తప్పని డోలీ మోత' వార్తకు స్పందించిన కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశంతో డీఎంహెచ్‌వో తల్లీ బిడ్డ ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలుసుకొని, వారి ఆరోగ్యం గురించి ఏరియా ఆస్పత్రి సూపరింటిండెంట్ సుధా శారదను వాకబు చేశారు. ఇదే ఆస్పత్రిలో పురుడు పోసుకున్న మరో ఇద్దరు గిరిజన బాలింతల ఆరోగ్యంపై ఆరా తీశారు. ముగ్గురు తల్లులు, వారి పిల్లలు ఆరోగ్యంగా ఉన్నారని జిల్లా వైద్యాధికారి తెలిపారు.

## పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవు

- వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో హెచ్చరిక

మాకవరపాలెం: వైద్య సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు వస్తున్నాయని, పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హైమావతి హెచ్చరించారు. స్థానిక పీహెచ్‌సీని ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, వ్యాక్సిన్ గదితోపాటు వార్డు, ఆపరేషన్ థియేటర్లను సందర్శించారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడారు. ఇక్కడి సిబ్బందిలో సమన్వయం లోపించిందని, రోగుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఇకపై జాబ్ చార్ట్ మేరకు విధులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. పీహెచ్‌సీల్లో ఉన్న ఖాళీల భర్తీపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. వైద్యాధికారి సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

**గొలుగొండ పీహెచ్‌సీ సందర్శన**

గొలుగొండ: జిల్లా వైద్యాధికారి డా.హైమావతి చీడిగుమ్మల పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి సిబ్బందితో సమావేశమై రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. వైద్యాధికారి కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయినా విముక్తి లేదు

- రిలీవర్లు లేక హిందీ పండిట్ల కష్టాలు
- 136 మందికి ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చినా చేరినవారు 26 మందే..
- పాఠశాలలో మరో హిందీ టీచర్ లేరని రిలీవ్ చేయని ప్రభుత్వం




నక్కపల్లి: బదిలీల ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా తాము కోరుకున్న పాఠశాలల్లో చేరేందుకు రిలీవింగ్ ఉత్తర్వులు రాక పలువురు హిందీ పండిట్లు నిరాశకు లోనవుతున్నారు. తమను రిలీవ్ చేసి బదిలీ చేసిన పాఠశాలల్లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలంటూ మొరపెట్టుకుంటున్నారు. పాఠశాల విద్యా విభాగంలో నెలన్నర క్రితం చేపట్టిన హిందీ పండిట్ల బదిలీల కౌన్సెలింగ్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో పలువురు హిందీ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో 183 మంది హిందీ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా వారిలో 136 మంది బదిలీ ఉత్తర్వులు పొందారు. అయితే వారికి ప్రత్యామ్నాయం (రిలీవర్) ఉండాలని, కానిపక్షంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి వీల్లేదంటూ ప్రభుత్వం కొత్త సమస్య లేవనెత్తింది. దీంతో బదిలీ అయిన వారిలో కేవలం 26 మందికి మాత్రమే వారు కోరుకున్న పాఠశాలల్లో విధుల్లో చేరేందుకు అవకాశం ఏర్పడింది. రిలీవర్లు లేకపోవడంతో బదిలీ ఉత్తర్వులు పొందిన మిగిలిన వారు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లోనే కొనసాగుతున్నారు. తాము పనిచేస్తున్న పాఠశాలల్లో ఒక్క స్కూల్ అసిస్టెంట్ హిందీ ఉపాధ్యాయ పోస్టు మాత్రమే ఉండటంతో బదిలీ అయినవారంతా ఆయా పాఠశాలల్లోనే కొనసాగక తప్పడం లేదు.

**ఇది ఎన్నటికీ తీరని సమస్య**

2025 డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉమ్మడి విశాఖ నుంచి కేవలం 23 హిందీ పండిట్ పోస్టులు మాత్రమే ఉన్నాయి. కనీసం ఏడాది కాలం పట్టే ఈ నియామక ప్రక్రియ పూర్తయ్యాక కూడా రిలీవర్ సమస్య వెంటాడే అవకాశం ఉందని పలువురు ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇది తీరని సమస్య అని, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ విద్యాసంవత్సరంలో ఇటువంటి నిబంధనలు అమల్లోకి తెచ్చి బదిలీ అయిన వారిని రిలీవ్ చేయకుండా కాలయాపన చేయడం తగదని వారు అంటున్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని కోరుతున్నారు. ఎంఈవో కుంచం నరేష్ వివరణ కోరగా బదిలీ ఉత్తర్వులు పొందిన ఉపాధ్యాయులు వారు కోరుకున్న పాఠశాలల్లో జాయిన్ అయ్యే విధంగా ఉత్తర్వులు ఇచ్చామన్నారు. వారి స్థానంలో రిలీవర్ వచ్చే వరకు వెనక్కి వచ్చి పాత పాఠశాలల్లో పనిచేయాలని ఆదేశించామన్నారు. రిలీవర్ వచ్చేక వారిని బదిలీ అయిన పాఠశాలలకు పంపించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి చాలా మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారని, అయితే అక్కడ పాఠశాలల్లో రిలీవర్లు లేకపోవడంతో ఏజెన్సీ నుంచి ఇక్కడకు బదిలీ అయిన వారిని వదిలిపెట్టడం లేదన్నారు. వారం పది రోజుల్లో ఈ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అయితే రిలీవింగ్ ఉత్తర్వులు సైతం ఇవ్వడం లేదని హిందీ ఉపాధ్యాయులు వాపోతున్నారు.

# సర్వే ఎందుకో చెప్పండి..

**చావనైనా చస్తాం గానీ.. భూములివ్వం**

- మాకు తెలీకుండా ప్రభుత్వం భూసేకరణకు యత్నిస్తోంది
- బలవంతంగా తీసుకుంటే చూస్తూ ఊరుకోం
- తహసీల్దార్‌ను నిలదీసిన పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లలపాలెం గ్రామస్తులు



పెదపల్లిలో యలమంచిలి తహసీల్దార్ వరహాలుతో గ్రామస్తుల వాగ్వాదం

యలమంచిలి రూరల్: పరిశ్రమల ఏర్పాటుకు కానీ, మరే ఇతర అవసరాలకు గానీ తమ భూములు ఇచ్చేది లేదని యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి, మంత్రిపాలెం, పెదగొల్లలపాలెం గ్రామాల ప్రజలు, రైతులు తెగేసి చెప్పారు. ఎర్రవరం రెవెన్యూ పరిధి పెదపల్లి ప్రాంతంలో రిజర్వ్ ఫారెస్ట్ భూములు సరిహద్దుగా ఎంత విస్తీర్ణంలో ప్రభుత్వ, జిరాయితీ భూములు ఉన్నాయో తెలుసుకునేందుకు చేస్తున్న సర్వే ఎందుకో చెప్పాలని యలమంచిలి తహసీల్దార్‌ను మంగళవారం నిలదీశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పెదపల్లి ప్రాంతంలో ప్రభుత్వ భూముల విస్తీర్ణాన్ని నిర్ధారించడానికి సర్వే చేస్తున్నామని తహసీల్దార్ వరహాలు చెప్పడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మంగళవారం మంత్రిపాలెం వేమాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులతో తహసీల్దార్ నిర్వహించిన సమావేశంలో అరుపులు, కేకలతో గందరగోళం ఏర్పడింది. బలవంతంగా భూమిని సేకరిస్తే ఎవరికైనా కేటాయిస్తే తమకు ఆత్మహత్యలు చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని రాతపూర్వకంగా పేర్కొంటూ తహసీల్దారుకు గ్రామస్తులంతా సంతకాలు చేసిన వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకే పెదపల్లి ప్రాంతంలో అటవీ భూములు మినహాయించి ఎంత ప్రభుత్వ భూమి ఉందో పెదపల్లికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు భూముల సర్వేను మూకుమ్మడిగా వ్యతిరేకించారు. వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు బొద్దపు ఎర్రయ్యదొర, కోడిగుడ్డు రమణ, దాసరి కుమార్, బొద్దపు నాగేశ్వరరావు, దుంగా అచ్యుతరావు, బొద్దపు రమణ, బొద్దపు కృష్ణ, బొద్దపు గణేష్, బొద్దపు మణిప్రకాష్, బొద్దపు కాశీ, మరిశా ఈశ్వరరావు, చిత్త ఈశ్వరరావు, అనసూరి కృష్ణ పాల్గొన్నారు.

**విరమించుకోకపోతే తిరగబడతారు**



పెదపల్లి, మంత్రిపాలెం గ్రామాలకు చెందిన రైతులంతా చిన్న, సన్నకారు రైతులే. చిన్న రైతుల్ని అన్యాయం చేసి భూములను లాక్కొనే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటివి చేస్తే ప్రజలంతా తిరగబడే రోజులొస్తాయి. మా గ్రామాన్ని, మా భూములను కాపాడాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నాం.

–అనసూరి కృష్ణ, టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ

**తాత ముత్తాతల నుంచీ వ్యవసాయమే..**



తాత ముత్తాతల కాలం నుంచీ ఏదో రైతు పని చేసుకుని బతుకుతున్నాం. ఆవునో, మేకనో, కోడినో, కుక్కనో పెంచుకొని బతికేవాళ్లమి. మాకు కంపెనీలవీ వద్దండీ. పిల్లా జెల్లలతో ఉన్నాం. ఎక్కడికీ యెళ్లిపోలేం. మాకు కంపెనీలొద్దు, డబ్బొద్దు.. మా భూములు మాకుంచండి.. మీకు వందనాలు.

–దంట్ల ఈశ్వరరావు, 22వ వార్డు

**మాకు భూములే కావాలి.. డబ్బులొద్దు**



నాకు రెండెకరాల భూమి ఉంది. పంటలు పండించుకొని తింటున్నామండి. మాకు భూములే కావాలి. డబ్బులొద్దు. గొడ్లయ్యి ఉన్నాయండీ. సొమ్ములున్నాయండీ. ఎక్కడికి పోతామండి. దానిమీదే కష్టపడి బతుకుతున్నామండి. పూర్వీకుల నుంచి వచ్చిన భూమి వదులుకోలేం.

–గొంతిన సూర్యమణి, పెదపల్లి

**బలవంతంగా తీసుకుంటే సచ్చిపోతాం**



మాకు ఆ భూముంటే చాలండి. డబ్బులొద్దు. భూముంటే ఏదోలా కష్టపడైనా బతుకుతాం. ఇకవేళ బలవంతంగా మా భూములు తీసుకుంటే సచ్చిపోతామండి. మాకు ప్రాణాలెక్కువకాదు. ఉన్న మాటే సెబుతున్నా.

–సేనాపతి నాగమణి, పెదపల్లి

## క్లుప్తంగా

### నేడు ఎస్.రాయవరం ఎంపీపీ ఎన్నిక

ఎస్.రాయవరం: మండల పరిషత్ అధ్యక్ష ఎన్నిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఎన్నికల అధికారి కె.మనోరమ తెలిపారు. గత నెలలో ఎంపీపీగా ఎన్నికయిన కేసుబోయిన వెంకటాలక్ష్మి వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేయడంలో ఇంత వరకు ఇన్‌చార్జ్ ఎంపీపీగా, వైస్ ఎంపీపీగా ఉన్న బొలిశెట్టి గోవిందరావు నిర్వహించారు. ప్రభుత్వం నోటిఫికేషన్ ప్రకారం బుధవారం ఎన్నిక నిర్వహించేందుకు ఆదేశాలు వచ్చాయన్నారు. ఎంపీటీసీలు అందరూ హాజరై ఎన్నికలో పాల్గొని ఎంపీపీ ని ఎన్నికోవాలన్నారు.

### ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలి



ఈపీడీసీఎల్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చోడవరం : జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లకు సంబంధించి విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని, పదోన్నతులు ఇవ్వాలని పలువురు ఎనర్జీ అసిస్టెంట్లు మంగళవారం విశాఖలో ఈపీడీసీఎల్ జనరల్ మేనేజర్ డి.సుమన్ కళ్యాణికి వినతి పత్రం అందజేశారు. జేఎల్ఎం గ్రేడ్ 2 ఎనర్జీ అసిస్టెంట్లను విద్యుత్ సంస్థలో పూర్తిగా విలీనం చేసి, సహాయ లైన్‌మేన్‌లుగా పదోన్నతులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్.సత్యారావు, పి. శ్రీనివాసరావు, చంద్రశేఖర్, అప్పలరాజు, శంకరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

### జాబ్‌మేళాలో 225 మంది ఎంపిక



జాబ్‌మేళానుద్దేశించి మాట్లాడుతున్న నైపుణ్యాధికారి గోవిందరావు

నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. సుమారు 15 కంపెనీలు పాల్గొన్నాయి. 500 మందికి పైగా నిరుద్యోగ యువతీ,యువకులు హాజరయ్యారు. ఫార్మా తదితర కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు మాట్లాడుతూ వివిధ కంపెనీల్లో 1500 పైగా ఖాళీలకు సంబంధించి జాబ్ మేళా ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, ఇంజినీరింగ్ ఆర్ట్స్,సైన్స్‌గ్రూపులకు చెందిన నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, 60 మందికి నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు పాల్గొన్నారు.

# ఇక సమరమే.. టైటిల్‌పై కెప్టెన్ల కన్ను

- ఆగస్టు 8 నుంచి ఏపీఎల్ హోరు!
- అందరి చూపు విశాఖ క్రీడాకారుల వైపే..



విశాఖ స్పోర్ట్స్: ఆంధ్ర ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)లో ఆటగాళ్ల వేలం ముగిసింది. నాలుగో సీజన్ కాస్త అలస్యమైనా.. ఆగస్టు 8 నుంచి 23 వరకు అట్టహాసంగా ప్రారంభం కానుంది. అన్ని మ్యాచ్‌లకు నగరంలోని వైఎస్ రాజశేఖర రెడ్డి స్టేడియం వేదిక కానుంది. ఈ టోర్నీలో మొత్తం 25 మ్యాచ్‌లు (4 ప్లేఆఫ్‌లతో కలిపి) జరగనున్నాయి. ఏపీఎల్ కేవలం అభిమానులను ఉత్సాహపరచడమే కాకుండా.. ఎందరో యువ ఆటగాళ్లకు ఐపీఎల్ లాంటి మెగా టోర్నీల్లో తలుపు తట్టే సువర్ణావకాశం కల్పించనుంది. వేలానికి ముందే ఏడు ఫ్రాంచైజీలు తమ కెప్టెన్లను ఎంచుకోగా.. మిగిలిన ఆటగాళ్ల కోసం వేలం జరిగింది. మొత్తం 520 మంది ఆటగాళ్లలో 135 మందిని ఫ్రాంచైజీలు దక్కించుకున్నాయి.

**సీనియర్ల సారథ్యం**

ఈ సీజన్‌లో జట్లకు నాయకత్వం వహించనున్న వారిలో విశాఖ ఆటగాళ్ల హవా కనిపిస్తోంది. సింహాద్రి వైజాగ్ లయన్స్‌కు రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో అత్యధిక ధర పలికిన రికీ భుయ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. భీమవరం బుల్స్‌ను నితీష్ కుమార్ రెడ్డి, అందుబాటులో లేకపోతే సత్యనారాయణ రాజు నడిపిస్తాడు. కాకినాడ కింగ్స్‌కు డిఫెండింగ్ కెప్టెన్, వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ తన బాధ్యతలను కొనసాగించనున్నాడు. రాయల్స్ రాయలసీమ విశాఖకే చెందిన అవినాష్‌ను వేలంలో అత్యధిక ధరకు దక్కించుకుంది. అయితే కెప్టెన్సీని రిటైన్ చేసుకున్న రషీద్‌కు ఇస్తారా లేక అవినాష్‌కు అప్పగిస్తారా అనేది తేలాల్సి ఉంది. స్టార్ బ్యాటర్ హనుమ విహారి తిరిగి ఏపీఎల్‌లోకి వచ్చాడు. అమరావతి రాయల్స్ జట్టును నడిపించనున్నాడు. విజయవాడ సన్‌షైనర్స్‌కు గత సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన అశ్విన్ హెబ్బర్ నాయకత్వం వహించనున్నాడు. తుంగభద్ర వారియర్స్ కెప్టెన్సీ విశాఖకే చెందిన శశికాంత్ లేదా స్టీఫెన్లలో ఒకరికి దక్కే అవకాశం ఉంది.

**యువతపైనే అందరి దృష్టి**

ఈసారి ఏపీఎల్‌లో యువ ఆటగాళ్లపై ప్రత్యేక దృష్టి నెలకొంది. ప్రతి జట్టులో ఇద్దరు అండర్-19 ఆటగాళ్లు ఉండాలనే నిబంధనతో ఫ్రాంచైజీలు యువ ప్రతిభకు పట్టం కట్టాయి. వారియర్స్ జట్టు ఏకంగా ఆరుగురు అండర్-19 ఆటగాళ్లను కొనుగోలు చేసి పెద్ద ప్రయోగానికే సిద్ధమైంది. బీ గ్రేడ్‌లో బేస్ ప్రైజ్ రూ.60 వేలు, సీ గ్రేడ్‌లో రూ.30వేలుగా నిర్ణయించగా.. వేలంలో కొందరు యువ ఆల్‌రౌండర్లు ఊహించని ధర పలికారు. వీరారెడ్డి (అనంతపురం)ని లయన్స్ జట్టు ఏకంగా రూ. 4.20 లక్షలకు కొనుగోలు చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇటీవల అంతర్ జిల్లాల టోర్నీలో వీరారెడ్డి 86.80 స్ట్రయిక్‌రేట్‌తో 592 పరుగులు చేశాడు. 3.56 ఎకానమీతో 10 వికెట్లు, 8 స్టంపింగ్‌లతో అద్భుత ప్రదర్శన చేశాడు. ఆర్దిత్ (కడప)ను వారియర్స్ జట్టు రూ. లక్షకు దక్కించుకుంది. ఆర్దిత్ 332 పరుగులు, 14 వికెట్లతో సత్తా చాటాడు. జయచంద్ర కేశవ్ (గుంటూరు)ను కూడా వారియర్స్ జట్టే రూ. 90 వేలకు కొనుగోలు చేసింది. కేశవ్ 158.43 స్ట్రైక్ రేట్‌తో 282 పరుగులు చేసి తన దూకుడును ప్రదర్శించాడు. వీరే కాక ప్రదీప్, బస్వాంత్, విష్ణు దత్త, భార్గవ్, నాగవినయ్, ధీరజ్, మనోజ్, దుర్గేశ్, రామ్‌కుమార్, ఈశ్వర్, హర్షసాయి, ఆనంద్, ఆకాష్, శ్రీదత్త, తోషిత్ వంటి ఎందరో అండర్-19 ఆటగాళ్లు జట్లకు ఎంపికయ్యారు. అయితే వీరిలో తుది జట్టులో ఎంతమందికి అవకాశం దొరుకుతుందో చూడాలి. అయితే అంతర్ జిల్లాల టోర్నీలో అద్భుతంగా రాణించిన వరుణ్ సాయి (26 వికెట్లు), ప్రణీత్, మన్విత్ (500కి పైగా పరుగులు) వంటి ఆటగాళ్లను ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయకపోవడం గమనార్హం. మొత్తం మీద జట్ల ఎంపిక పూర్తి కావడంతో ఇప్పుడు అందరి దృష్టి టైటిల్‌పైనే ఉంది. అనుభవజ్ఞులైన కెప్టెన్లు, ఉత్సాహవంతులైన యువ ఆటగాళ్లతో ఈ నాలుగో సీజన్ ఎలాంటి సంచలనాలకు వేదిక అవుతుందో వేచి చూడాలి.

## బ్యాంకు లింకేజీతో రూ.193 కోట్ల రుణాల పంపిణీ

- యూనిట్లు ఏర్పాటు చేస్తేనే రుణాలు మంజూరు
- డీఆర్‌డీఏ పీడీ శచీదేవి వెల్లడి



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శచీదేవి

మాకవరపాలెం : జిల్లాలో బ్యాంకు లింకేజీ ద్వారా 39,400 గ్రూపులకు రూ.193 కోట్లు రుణాలు అందించామని డీఆర్‌డీఏ పీడీ శచీదేవి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 4 లక్షల 4 వేల మంది డ్వాక్రా మహిళలున్నారన్నారు. వీరికి ఈ ఏడాది రూ.900 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడమే లక్ష్యమన్నారు. ఇప్పటివరకు రూ.193 కోట్లు ఇచ్చామని, స్త్రీ నిధి ద్వారా రూ.221 కోట్లు లక్ష్యం కాగా రూ.39 కోట్లు రుణంగా పంపిణీ చేశామన్నారు. రుణాలు అవసరమైన మహిళల వివరాలను ఇప్పటికే సిబ్బంది ద్వారా సర్వే చేయించామన్నారు. దశల వారీగా వారికి రుణాలు ఇస్తున్నట్టు చెప్పారు. రుణాలు పొందిన మహిళలు గతంలో మాదిరిగా గేదెలు, మేకలు, గొర్రెలు కాకుండా ఎంబ్రాయిడింగ్, కొవ్వొత్తుల తయారీ, పిండి వంటలు, పేపర్ ప్లేట్లు, ఫుడ్ యూనిట్లు, ఫొటో స్టూడియో, చిన్న చిన్న పరిశ్రమలు వంటివి ఏర్పాటు చేసి కనీసం ఒక్కరికైనా ఉపాధి చూపాలన్నారు. ఈ యూనిట్లు పరిశీలించిన తరువాతే రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తులు, పిండి వంటల తయారీ యూనిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మంగ, సీసీలు పాల్గొన్నారు.

## 'రాష్ట్రంలో 12వ పే కమిషన్ ప్రకటించండి'



ధర్నాలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు

మహారాణిపేట: రాష్ట్రంలో 12వ పే కమిషన్‌ను వెంటనే నియమించాలని, తక్షణం మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డీడీ ప్రసాదరావు డిమాండ్ చేశారు. అఖిల భారత స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపుపై రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న జిల్లా పెన్షనర్స్ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడారు. పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పెన్షన్ వేలిడేషన్ సవరణ బిల్లుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు నష్టం వాటిల్లుతుందన్నారు. దీన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రిటైర్డు ఎస్‌టీవో జె.సత్యారావు, అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీవీ రమణమూర్తి, ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు, పైలా రామలింగేశ్వరరావు, కోశాధికారి టి.గోపాలకృష్ణ, జాయింట్ సెక్రటరీ(ఉమెన్స్ వింగ్) బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం తమ డిమాండ్లపై జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

## పాలిటెక్నిక్ లేటరల్ ఎంట్రీకి దరఖాస్తుల ఆహ్వానం

మురళీనగర్: ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణులైన అనంతరం బ్రిడ్జి కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కాలేజీల్లో నేరుగా రెండో ఏడాదిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.రత్నకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులను ఈనెల 18వ తేదీలోగా సమర్పించాలన్నారు.

19వ తేదీన ఉదయం 10 గంటలకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు ప్రభుత్వ కాలేజీలకు రూ.6,000లు, ప్రైవేటు కాలేజీలకు రూ.26,000 తక్షణమే చెల్లించాల్సి ఉంటుందన్నారు.

# అనధికార చిట్టీలు కట్టొద్దు



సాక్షితో మాట్లాడుతున్న సీఐ ధనుంజయరావు

యలమంచిలి రూరల్: అనధికార చిట్టీలు, అధిక వడ్డీల ఆశ చూపి చేస్తున్న ఫైనాన్స్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని యలమంచిలి సీఐ ఎస్.ధనుంజయరావు సూచించారు. మంగళవారం సాక్షిలో 'వడ్డీలు..చిట్టీలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆయన ఛాంబర్‌లో సాక్షితో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని, అలాంటివారి పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలన్నారు. అనధికారికంగా రిజిస్ట్రేషన్ లేని ఫైనాన్స్ సంస్థలు, వ్యక్తుల వద్ద ఎక్కువ మొత్తంలో డబ్బు డిపాజిట్ చేస్తే వాళ్లు ప్రజల్ని మోసగించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అధిక వడ్డీలకు ఆశ పడితే మోసపోతారన్నారు. జాతీయ బ్యాంకులు, ఆర్‌బీఐ గుర్తింపు పొందిన ప్రైవేటు బ్యాంకుల్లోనే డబ్బు దాచుకోవాలని ఆయన ప్రజలకు సూచించారు.

అనధికార చిట్టీలు నిర్వహించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార చిట్టీలు నిర్వహించేవారి సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందజేయాలన్నారు. కష్టపడి, చెమటోడ్చి రూపాయి రూపాయి పోగు చేసిన విలువైన డబ్బును మోసగాళ్ల చేతిలో పెట్టి నష్టపోవద్దని ఆయన ప్రజల్ని కోరారు. యలమంచిలి మున్సిపాలిటీ తెరువుపల్లిలో పలువురి వద్ద నుంచి అనధికారికంగా చిట్టీలు కట్టించుకుని పరారైన దాడిశెట్టి పైడియ్య (నానాజీ)పై యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. 117 మంది నుంచి రూ.60 లక్షలకు పైగా డబ్బు చిట్టీల రూపంలో కట్టించుకున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ అయిందన్నారు. కేసు దర్యాప్తు జరుగుతోందని, పరారీలో ఉన్న నిందితుడి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయన్నారు. ఇందులో యలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర పాల్గొన్నారు.



## ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



గర్నికంలో ప్రమాదం జరిగిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్

రావికమతం : మండలంలో గర్నికం తిరుమల కల్యాణ మండపం సమీపంలో గల దుర్గా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో మంగళవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గ్యాస్ స్టౌ నుంచి సిలిండర్‌ను కదుపుతున్న సమయంలో పైపు నుంచి గ్యాస్ లీకై మంటలు చేలరేగి ఈ ప్రమాదం సంభవించిందని, తక్షణమే సమీపంలో గల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించామని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమాని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, సెంటర్‌లో పనిచేస్తున్న సిబ్బంది కలిసి మంటలను అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని, పాత్రలు మాత్రమే కాలిపోయాయన్నారు.

## బీర్ బాటిళ్లతో వ్యక్తిపై దాడి

- అర్ధరాత్రి మద్యం మత్తులో యువకుల హల్‌చల్
- 11మంది అరెస్టు



చికిత్స పొందుతున్న జీవన్‌కుమార్

గాజువాక: మద్యం మత్తులో ఇంటి ముందు గొడవ చేస్తున్న యువకులను వారించిన వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. గాయపర్చిన నలుగురితోపాటు మరో ఏడుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలివి.. బీసీ రోడ్‌లో నివాసమంటున్న జీవన్‌కుమార్ తన ఇంటి ముందు నిలిపి ఉంచిన కారు వద్ద సోమవారం అర్ధరాత్రి కొంతమంది యువకులు మద్యం మత్తులో గొడవ చేస్తున్నారు. ఇది గమనించిన జీవన్‌కుమార్ వారిని వారించే ప్రయత్నం చేయగా.. గాజువాక ప్రాంతానికి చెందిన దనాల అప్పలరాజు, మజ్జి వెంకటరమణ, షేక్ బషీర్, మోహన్ కార్తీక్‌లు బీర్ బాటిళ్లతో జీవన్‌కుమార్‌పై దాడి చేసి గాయపర్చారు. అక్కడే ఉన్న మరో ఏడుగురు జీవన్‌కుమార్‌ను కిందికి లాక్కొని రావాలని, చంపేస్తామని గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకున్నారు. దీంతో 11 మంది యువకులు పరారయ్యారు. జీవన్‌కుమార్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా.. 11 మందిని పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. వీరిపై రౌడీషీట్ ఓపెన్ చేస్తామని పోలీసులు వెల్లడించారు.

## నేడు ఏయూలో జాబ్ మేళా

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలో బుధవారం ఉదయం 10.30 నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఏయూ యూఈఐ అండ్ జీబీ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. ఇందులో వీల్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ మెకానిక్, ఈఈఈ, ఈసీఈ(2023-2025 బ్యాచ్) విద్యార్హతలు ఉన్న వారిని ట్రైనీ గ్రాడ్యుయేట్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని వెల్లడించారు. అలాగే ఐటీఐలో వెల్డర్, టర్నర్, మెషినిస్టులను, క్వాలిటీ విత్ ఎన్‌డీటీ లెవెల్-1, 2 పోస్టులకు డిప్లమో అభ్యర్థులను తీసుకోనున్నట్లు వివరించారు. హెచ్‌డీఎఫ్‌సీ ఫైనాన్షియల్ కన్సల్టెంట్ కెరీర్ ప్రోగ్రాం కింద 10వ తరగతి నుంచి ఎంబీఏ అభ్యర్థులను, యాక్సిస్ బ్యాంక్-క్వెస్ కార్ప్ లిమిటెడ్ సంస్థ డిగ్రీ, ఆపై అర్హతలు ఉన్న వారిని రిలేషన్‌షిప్ ఆఫీసర్, సీనియర్ రిలేషన్‌షిప్ ఆఫీసర్, టీమ్ లీడర్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. అభ్యర్థులు ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ అండ్ గైడెన్స్ బ్యూరోలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ వివరాలను https://employment.ap.gov.in, https://www.ncs.gov.in లో పొందుపర్చాలని సూచించారు.

## నేటిలోగా బ్యాంకు ఖాతా తెరవండి

ఎంవీపీకాలనీ : తల్లికి వందనం పథకం నిధులు మంజూరైన నేపథ్యంలో అర్హులైన విద్యార్థులు బ్యాంకు ఖాతాలను ఓపెన్ చేసుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.రామారావు తెలిపారు. ఒకటో తరగతి విద్యార్థులకు వారి తల్లులు బ్యాంకు ఖాతా ఓపెన్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు వారి పేరు మీదే ఖాతాను తెరవాలన్నారు. ఓపెన్ చేసిన బ్యాంకు ఖాతాకు ఆధార్‌తోపాటు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయించుకోవాలన్నారు.

# చెరువుల అభివృద్ధితోనే రైతులకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధి వెంకటరావు





ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిని పెంచేలా కూరగాయలతో ఏర్పాటు చేసిన చిత్రం

కోటవురట్ల : చెరువుల అభివృద్ధితో రైతులకు మేలు కలుగుతుందని, తద్వారా మేలైన పంటల సాగుతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం ఉంటుందని ప్రపంచ బ్యాంకు ప్రతినిధి, సీనియర్ సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు బి.వెంకటరావు అన్నారు. సుంకపూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ సమీకృత నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ పరివర్తన కార్యక్రమంలో భాగంగా ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత పెద్ద చెరువును బృందం సభ్యులు పరిశీలించి స్థానిక అధికారులు, రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం జరిగిన అవగాహన సభలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు మాట్లాడుతూ ఈ గ్రామానికి ఇక్కడ ఉన్న చెరువు వ్యవసాయానికి కేంద్రబిందువు అవుతుందన్నారు. ఈ చెరువును గతంలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు 2018-19లో సందర్శించి అభివృద్ధికి రూ.97 లక్షలు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో సూయిజ్‌లు, పొర్లుగట్లు నిర్మించి చెరువును అభివృద్ధి చేశారన్నారు. దీని పరిధిలో 416 ఎకరాలకు సాగునీరు అందేలా చెరువును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. గ్యాప్ ఆయకట్టు మరమ్మతులు చేపట్టడం ద్వారా శివారు భూములు 160 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు. సాగులో ఆదునిక పద్ధతులను అవలంభించాలని, రసాయనాల పిచికారీకి డ్రోన్ స్ప్రేయర్‌ను వినియోగించాలని సూచించారు. ప్రపంచ బ్యాంకు ప్రతినిధి చీఫ్ అమాడోవ్, ఏపీఐఐఏటీపీ ఎస్ఈ ఎంఎస్‌వి వేణుగోపాల్, గ్రౌండ్ వాటర్ జేడీ కెఎస్ శాస్త్రి, హార్టీకల్చర్ డీడీ సుబ్బారావు, ఈఈ ఎం రేవతి, అగ్రి బిజినెస్ మస్తాన్‌రావు, డీపీడీ రాజేశ్వరరావు, డీఈలు రాజేంద్రకుమార్, జనార్దన్, జేఈలు సూర్యకుమారి, రాంజీ, జోజిబాబు, రామకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

## 'తెలుగు తమ్ముళ్ల' కుమ్ములాట

అనకాపల్లి టౌన్ : స్థానిక 84వ వార్డులో తెలుగు తమ్ముళ్ల కుమ్ములాట ప్రారంభమైంది. రెండు వర్గాలుగా టీడీపీ ఉండడంతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఒక వర్గానికే కొమ్ము కాయడం వల్ల వార్డులో సీనియర్ నాయకులు పార్టీ అధిష్టానానికి ఇప్పటికే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం టీడీపీ 84వ వార్డు కమిటీని పార్టీ కమిటీ ఎన్నికల పరిశీలకులు పీలా అచ్చెయ్యనాయుడు ఏర్పాటు చేస్తున్న సందర్భంలో వార్డుకు చెందిన సీనియర్లు అడ్డుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఏకపక్షంగా కార్యకర్తల అభిప్రాయాలతో సంబంధం లేకుండా ఎన్నికలు నిర్వహించి పార్టీ నియమావళికి వ్యతిరేకంగా ప్రకటించిన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మంగళవారం పార్టీ సీనియర్ కార్యకర్తలు అధిష్టానానికి తెలియజేశారు. అనకాపల్లి పార్లమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కుప్పిలి జగన్ మాట్లాడుతూ కమిటీలో ఓసీ, బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పినప్పటికీ అధ్యక్ష, కార్యదర్శుల పదవులు ఒకే సామాజిక వర్గానికి ఇవ్వడం తగదన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద నిర్ణయాలు ఏకపక్షంగా ఉన్నాయని, దీనివల్ల సీనియర్‌లు అందరూ పార్టీకి దూరమవుతున్నారన్నారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ శాఖ ఉపాధ్యక్షుడు బోడి వెంకట్రావు, వానపల్లి త్రినాథ్, పాండురు సత్యనారాయణ, అంద్రా బాబురావు, యర్రా సత్యనారాయణ పాల్గొన్నారు.

## పోక్సో కేసులో యువకుడికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్/పాయకరావుపేట: బాలికపై లైంగికదాడికి యత్నించిన యువకుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ విశాఖలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. జైలు శిక్షతోపాటు రూ.1000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ కారాగార శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తమ తీర్పులో స్పష్టం చేశారు. బాధితురాలికి రూ.25 వేలు పరిహారం చెల్లించాలని కూడా న్యాయమూర్తి పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బత్తిన రాజశేఖర్ అందించిన వివరాలివి. నిందితుడు బొడ్డపాటి ఆనంద్‌కుమార్ (20) పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీరామపురం నివాసి. పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవించేవాడు. బాధితురాలు నిందితుడి ఇంటికి సమీపంలో ఉండేది. ఉన్నత పాఠశాలలో చదువుకునేది. 2022 జూన్ 18వ తేదీ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆనంద్‌కుమార్ బాలిక ఇంటికి వెళ్లి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో పక్కనే ఉన్న తల్లిదండ్రులు నిందితుడిని పట్టుకున్నారు. దీనిపై పాయకరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద అప్పటి పోలీస్ అధికారి జి.శిరీష నిందితుడిపై కేసు నమోదు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తిపై విధంగా తీర్పునిచ్చారని సీఐ జి.అప్పన్న తెలిపారు.

## పలాసలో కి'లేడి' అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

కాశీబుగ్గ: తోటి ప్రయాణికులతో మాట కలుపుతూ చాకచక్యంగా బ్యాగులు కొట్టేస్తున్న మహిళా దొంగను పలాసలో పోలీసులు అరెస్టు చేశారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వెంకట అప్పారావు మంగళవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. అనకాపల్లికి చెందిన పారుపల్లి దుర్గా(40) ఆటోలు, బస్సుల్లో ప్రయాణిస్తూ దొంగతనాలు చేస్తుండేది. చోరీ కేసుల్లో పలుమార్లు జైలుశిక్ష అనుభవించింది. అయినా మార్పు రాలేదు. ఈ క్రమంలో జూన్ 6న గార మండలం దీపావళి గ్రామానికి చెందిన నల్ల రోహిణి అనే మహిళ పలాసకు బస్సులో బయలుదేరగా దుర్గా చాకచక్యంగా బ్యాగు కొట్టేసింది. అందులో నాలుగున్నర తులాల చైన్, తులంన్నర నెక్లెస్ పోయిందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు పాత నేరస్తురాలు దుర్గాపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో దుర్గా మంగళవారం శ్రీకాకుళంలో బస్సు ఎక్కి పలాస వస్తుండగా కాశీబుగ్గ బస్టాప్‌లో అదుపులోకి తీసుకున్నారు. తనిఖీ చేయగా ఆరు తులాల బంగారు ఆభరణాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని అరెస్టు చేశారు. ఈమెపై గతంలో శ్రీకాకుళం, గాజువాక, అనకాపల్లి, చోడవరం, నెల్లిమర్లలో చోరీ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ సూర్యనారాయణ, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

## సాగరతీరంలో కాలుష్య నియంత్రణకు కార్యాచరణ

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశం



బీచ్ వద్ద సముద్రంలోకి చేరుతున్న వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: విశాఖ సాగర తీరంలోకి వ్యర్థాలు, మురుగునీరు చేరకుండా నిరోధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్, పర్యవేక్షక ఇంజినీర్ పీవీవీ సత్యనారాయణ రాజుతో కలిసి మంగళవారం ఆర్కే బీచ్ నుంచి సబ్‌మెరైన్ వరకు తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యంగా ఆర్.కె.బీచ్, పాండురంగాపురం, వైఎంసీఏ సమీపంలో కాలుష్య నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వర్షపు నీటితో పాటు వ్యర్థాలు సముద్రంలో కలవకుండా బీచ్ ఒడ్డున ఒక ప్రత్యేక చానల్ నిర్మించాలని, పాండురంగాపురం వద్ద పనిచేయని మురుగు నీటి పంప్ హౌస్‌ను వెంటనే మరమ్మతు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కాలువల ద్వారా వ్యర్థాలు బీచ్‌లో చేరకుండా ప్రస్తుతం ఉన్న మెష్‌లను మార్చి, పటిష్టమైనవి ఏర్పాటు చేయాలన్నారు. పారిశుధ్య పనులపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్.. మినీ స్వీపింగ్ యంత్రాల పనితీరును మెరుగుపరచాలని జెడ్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవిందరావును ఆదేశించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్, ఏసీపీ మధుసూదనరావు, ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ అన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ



స్వామివారిని దర్శించుకుంటున్న స్కూలు కమిటీ మాజీ చైర్మన్ లోవరాజు దంపతులు

కశింకోట: మండలంలోని జమాదులపాలెం కాలనీలో అభయాంజనేయస్వామి ఆలయానికి స్థానిక స్కూలు కమిటీ మాజీ చైర్మన్ ఒమ్మి లోవరాజు, చినమ్మల దంపతులు మంగళవారం రూ.20 వేల విలువైన మైక్ సెట్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైక్‌సెట్ ద్వారా ఆలయంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఇతర సమాచారం భక్తులకు చేరుతాయన్నారు. లోవరాజు కుటుంబ సభ్యులతోపాటు స్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

### ప్రభుత్వం దృష్టికి తూర్పుకాపు భవన సమస్య

అనకాపల్లి: పట్టణంలో జిల్లా తూర్పుకాపు వెల్ఫేర్ అసోసియేషన్ భవనాన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు పలకా రాము, ప్రధాన కార్యదర్శి యడ్ల త్రినాథ్ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక దేమునిగుమ్మం వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తూర్పుకాపులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. వారి సమస్యలు పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తూర్పుకాపు భవనానికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు వినతిపత్రం అందజేసేందుకు ఏకగ్రీవంగా తీర్మానించామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి పలకా సత్యనారాయణ, మాజీ కార్యదర్శి నల్లాల శ్రీనివాసరావు, సభ్యులు అల్లు త్రినాథ్, బోడాల వేణుగోపాల్, కోట్ని అయ్యన్నదొర, పప్పల ఆదినారాయణ, ఆర్టీసీ సత్యనారాయణ, సతివాడ జగదీశ్వరరావు, తాడి చక్రవర్తి, ఎలమంచిలి రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డు తరలించాలని వినతి

అనకాపల్లి టౌన్: పట్టణ నడిబొడ్డున డంపింగ్ యార్డును తరలించాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పి.వీరుయాదవ్ కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 12 సంవత్సరాలుగా అనధికారికంగా నిర్వహిస్తున్న డంపింగ్ యార్డును తరలించాలని, ఇక్కడ చెత్తతోపాటు కోళ్ల వ్యర్థాలు వేస్తున్నారని వాపోయారు. దాంతో చుట్టుపక్కల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వ్యాధుల బారినపడే ప్రమాదముందన్నారు.

### ఇసుక లోడ్ లారీ సీజ్

మునగపాక: స్థానిక మెయిన్‌రోడ్డులో రికార్డులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం ఆర్‌టీఏ అధికారులు సీజ్ చేశారు. వాహన తనిఖీల్లో భాగంగా పూడిమడక రోడ్డులో వెళ్తున్న పలు వాహనాలను ఆర్‌టీఏ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని గుర్తించి కేసు నమోదు చేశారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 41 దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | - | - |
| రెండో రకం | 3,500 | 3,550 |
| మూడోరకం | 3,350 | 3,400 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| రాజా | : సూపర్ మ్యాన్ |
| సత్యనారాయణ స్క్రీన్-1 | : కన్నప్ప |
| సత్యనారాయణ స్క్రీన్-2 | : జురాసిక్ వరల్డ్ 3డి వెర్షన్ తెలుగు |
| పర్తిసాయి | : ఓ భామ అయ్యో రామ |
| షిర్డీసాయి | : తమ్ముడు |
| వెంకటేశ్వర | : వర్జిన్ బాయ్స్ |
| శ్రీ సత్య | : ది 100 |
| రామచంద్ర | : 3 బీహెచ్‌కే |

### రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 60 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-19, బీ పాజిటివ్-7, ఓ పాజిటివ్-31, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్త నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యూ లోకేష్(9703613706)ను సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

# విషజ్వరాల విజృంభణ



## వాతావరణ మార్పులతో ఫ్లూ వైరస్ తీవ్రత

- దగ్గు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు
- ఫ్రైడేను డ్రైడేగా పాటించాలంటున్న అధికారులు
- పంచాయతీల్లో కానరాని పరిసరాల పరిశుభ్రత

తుమ్మపాల: వాతావరణ మార్పులతో ఫ్లూ వైరస్ విజృంభిస్తోంది. దగ్గు, జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. దగ్గుతోపాటు రోజులు తరబడి తగ్గని జ్వరాలతో రోగులు ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. పరిసరాలను శుభ్రం చేసుకుంటూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు, దగ్గు భారీ నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉందంటూ అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంతోపాటు మండలంలో తుమ్మపాల, వెంకుపాలెం, ఊడేరు, దిబ్బపాలెం, మార్టూరు, రేబాక, గొలగాం, తదితర గ్రామాల్లో కొద్ది రోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణ వైరల్ ఫీవర్‌కు భిన్నంగా దగ్గు, జ్వరం వస్తోంది. జ్వరం తగ్గినా కాళ్లూ చేతుల నొప్పుల తగ్గకపోవడంతో బాధితులు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో వాతావరణ మార్పులకు వచ్చిన జ్వరాల కన్నా జూలైలో తీవ్రత విపరీతంగా పెరిగింది. కొన్ని చోట్ల టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలు అధికమయ్యి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రితోపాటు పట్టణంలో ప్రైవేటు క్లినిక్‌లు, ఆస్పత్రుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు.

**డ్రై డేగా ఫ్రై డేను పాటించాలి....**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దీంతోపాటు ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే మనం ఆరోగ్యంగా ఉంటామంటున్నారు. ఇంటిలో నీటి నిల్వలు చేస్తున్న పాత్రలను ప్రతి శుక్రవారం శుభ్రం చేసి ఆరబెట్టాలి. ఫ్రిడ్జ్ వంటి ఎలక్ట్రిక్ పరికరాలలో నీటి నిల్వలను కూడా తొలగించాలి. వాస్‌రూమ్‌లను శుభ్రం చేసుకోవాలి. ఇంటి బయట ఎటువంటి వ్యర్థాలు లేకుండా చూసుకోవాలి. కుండీలు, మట్టి పాత్రలు, ప్లాస్టిక్ పరికరాలలో నిల్వ నీరు, తాగిన కొబ్బరి బొండాల్లో నీరు చేరడం, టైర్లలో నీరు లేకుండా దృష్టి పెట్టి శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



తుమ్మపాలలో వీధి శివారున పేరుకుపోయిన చెత్త

### జ్వరాల నివారణపై జాగ్రత్తలు...

- జ్వరం, దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యంపైన, మందుల షాపులపైన ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి.
- వీలైనంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మాస్క్ ధరించాలి.
- యాంటీబయాటిక్ మందులు, దగ్గు సిరప్‌లు ఇష్టారాజ్యంగా వాడకుండా వైద్యులు సూచించిన మందులనే వినియోగించాలి.
- దుమ్ము, ధూళి, పొగ ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- ఆస్తమా, షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు దగ్గు తీవ్రత పెరుగుతున్నట్లు అనిపించినా, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

### జ్వరంతో బాధపడుతున్నా

వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాను. దగ్గుతోపాటు నీరసం వచ్చింది. ప్రైవేటు మందుల షాపుకు వెళ్లి మందులు వాటినా నయం కాలేదు. ఇక లాభం లేదని పట్టణంలో ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నాను. వైద్య పరీక్షలు చేసి ఇంజక్షన్, మందులు ఇచ్చారు. జ్వరం తగ్గకపోతే మరిన్ని పరీక్షలు చేసి వైద్యం అందిస్తామని వైద్యులు చెప్పారు.

– కె.నాయుడు, తుమ్మపాల గ్రామం

### జ్వరాలు తీవ్రతరం కాకుండా చర్యలు



గ్రామాల్లో అందరికీ మందులు అందిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో సీజనల్ జ్వరాలు వైరల్ అవుతున్నాయి. గ్రామాల్లో వైద్య సిబ్బంది ద్వారా సమాచారం తెలుసుకున్న వెంటనే రోగుల ఇంటి వద్దకు వెళ్లి పరిక్షలు చేసి మందులు అందిస్తున్నాం. జ్వరాల వ్యాప్తికి అవకాశం లేకుండా చూస్తున్నాం.

– డాక్టర్ వాణి, పీహెచ్‌సీ వైద్యురాలు, తుమ్మపాల

## శుభాంశు శుక్లాకు అభినందనలు



శుభాంశు శుక్లాకు అభినందనలు తెలుపుతూ విద్యార్థులు ప్లకార్డుల ప్రదర్శన

అనకాపల్లి టౌన్: అంతరిక్ష కేంద్రం నుంచి విజయవంతంగా భూ మండలానికి చేరుకున్న భారత వ్యోమగామి శుభాంశు శుక్లాకు హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు అభినందనలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ శెట్టి గిరీష్‌కుమార్ మాట్లాడుతూ రోదసీలో 18 రోజులు గడిపి మానవాళికి అనేక ప్రయోజనకరమైన విషయాలను అందించారన్నారు. ప్రపంచ స్థాయిలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు చాటి చెప్పారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

## చెట్టుపై నుంచి పడి కల్లుగీత కార్మికుడి మృతి

అనకాపల్లి టౌన్: పట్టణంలలోని తాటి చెట్టు నుంచి కల్లు తీస్తుండగా కల్లుగీత కార్మికుడు జారి పడి మృతి చెందాడు. పట్టణ సీఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా పల్లెవారి వీధిలో మంగళవారం ఉదయం రాగాల గురువునాయుడు(47) తాటి చెట్టు నుంచి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుని భార్య గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## ఎండలకు ఉక్కిరి బిక్కిరి



వెలవెలబోతున్న కశింకోటలో పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట: మండల ప్రజానీకం మంగళవారం సూర్య ప్రతాపం, వడగాల్పులతో సతమతమయ్యారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత తగ్గలేదు. దీంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. కశింకోటలోని ప్రధాన పంచాయతీ రహదారి జన సంచారం లేక వెలవెలబోయింది. బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య ప్రయాణం తగ్గిపోయింది. ఒక వైపు ఎండ తీవ్రతతోపాటు వడగాల్పులు వేసవిని తలపించే విధంగా వీయడంతో ఉక్కిరి బిక్కిరయ్యారు. ఒక వైపు ఎండలు, మరో వైపు విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది చెందారు. సోమవారం రాత్రి పలు దఫాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా కాకపోవడమే ఇందుకు కారణమని సిబ్బంది అంటున్నారు.

## కమిటీలో ఉప కులాలకు ప్రాధాన్యమివ్వాలి

**జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుల డిమాండ్**



సమావేశంలో మాట్లాడుతున్న అప్పలరాజు

అనకాపల్లి: నూతనంగా నియమించే జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీలో ఉప కులాల వారికి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత కమిటీ జిల్లా సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. స్థానిక నెహ్రూచౌక్‌లోని ఓ ప్రైవేట్ భవనంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మాల, మాదిగ, రెల్లి నాయకులు కలిసి కలెక్టర్, ఎస్పీకి వినతిపత్రం ఇచ్చేందుకు సమాలోచనలు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో నియమించే కమిటీలో ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో సబ్ కులాలు వారు సైతం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అట్రాసిటీ కేసులు పర్యవేక్షణ, ముందస్తు జాగ్రత్త చర్యలకు వేసే కమిటీలో అన్ని ప్రాంతాల వారీగా ప్రాధాన్యత కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కట్టుమూరి మంగరాజు, దళిత బహుజన ఆదరణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లి చిన్న అప్పారావు, దళిత సంఘం సీనియర్ నాయకుడు చెవ్వేటి అప్పారావు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు చిత్రలేఖనం పోటీలు



చిత్ర లేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థినులు



విజేతలతో ఉపాధ్యాయులు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూలులో మంగళవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. భారత్ పెట్రోల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీలో విద్యార్థినులు ఉత్సాహంగా హాజరయ్యారు. వీరిలో ఒ. లహరి ప్రసూన్న ప్రథమ, కె. మీరాకుమారి ద్వితీయ, కె. నాగవెంకటలక్ష్మి ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు గెలుచుకున్నారు. వీరికి కార్పొరేషన్ ప్రతినిధులు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం జి.శశికళ, చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పి.వి.ఆర్. రమేష్, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వృత్తి విద్యా కోర్సుల్లోనూ రాణించాలి



డీపీఎన్‌జెడ్పీ హైస్కూలులో విజేతలకు బహుమతులు అందజేత

కశింకోట: విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యా కోర్సుల్లో రాణించి అభివృద్ధి సాధించాలని ఎస్.వి.జె. ప్రసాద్, ఇన్‌చార్జి హెచ్‌ఎం జి. శశికళ ఆకాంక్షించారు. స్థానిక బాలికల హైస్కూలులో ప్రపంచ యువత నైపుణ్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇక్కడ ఎలక్ట్రానిక్స్, అపెరల్ అండ్ మేడ్-అప్స్, బ్యూటీ అండ్ వెల్‌నెస్ వంటి వృత్తి విద్యా కోర్సులు చదువుతున్న 9, 10 తరగతుల బాలికలకు వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఇందులో విజేతలకు ఇన్‌చార్జి హెచ్‌ఎం బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయినులు బి. నిర్మల, ఎం. స్టెల్లా నిఖిల్, కె.రజని పాల్గొన్నారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవ ప్రాధ్యానతను హెచ్‌ఎం వివరించారు. వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

## సాగునీటి కాలువల పనులు పరిశీలన



సాగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి: మండలంలో రైతులు సకాలంలో వరి, ఇతర పంటలు వేసుకునేందుకు సాగునీటి కాలువలను రూ. 2 కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. మండలంలో వివిధ ప్రాంతాల్లో సాగునీటి కాలువలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాగునీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడం వల్ల ఖరీఫ్ సీజన్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ కార్మికుల ద్వారా గ్రామాల్లో ఇప్పటికే కొన్ని సాగునీటి కాలువల్లో మట్టిని తొలగించారన్నారు. అంతకుముందు కొండుపాలెం దగ్గర పోతికొండ గడ్డ, శంకరం, రేబాక, ఎదురులు గడ్డ, తుమ్మపాల కాలువ, చెర్లోపల, పులి కాలువలను పరిశీలించారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ స్వామినాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శుల రిలీవ్‌లో తాత్సారం

కశింకోట: మండలంలో తొమ్మిది పంచాయతీల్లో పని చేస్తున్న కార్యదర్శులకు బదిలీ ఉత్తర్వులు వచ్చి దాదాపు నెల రోజులు కావస్తున్నా, అధికారులు రిలీవ్ చేయకుండా తాత్సార్యం చేస్తున్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన 9 మంది కార్యదర్శులను నెల రోజుల క్రితం బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కశింకోటలోని మూడు సచివాలయాలు, అచ్చెర్ల, చింతలపాలెం, పరవాడపాలెం, ఏనుగుతుని, బయ్యవరం పంచాయతీ కార్యదర్శులకు బదిలీ అయింది. వారు బాధ్యతలు చేపట్టాల్సిన పంచాయతీలను కూడా కేటాయించారు. ఈ మేరకు ఆయా ప్రాంతాలకు వెళ్లి బాధ్యతలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే వీరికి మండల స్థాయి అధికారులు రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. దాంతో ఏమి చేయాలో పాలుపోక సతమతమవున్నారు. తమకు సత్వరమే రిలీవింగ్ ఉత్తర్వులు ఇవ్వడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో వి.వి. రవికుమార్‌ను సంప్రదించగా నిబంధనలు అనుసరించి ఇతర ప్రాంతాల నుంచి కార్యదర్శులు వచ్చి జాయిన్ అయిన తర్వాత ఇక్కడి వారిని రిలీవ్ చేయనున్నట్లు తెలిపారు. ఇద్దరు కార్యదర్శులు వచ్చారన్నారు. మిగిలిన వారు రావలసి ఉందన్నారు. విశాఖ ప్రాంతానికి బదిలీ అయిన కార్యదర్శులు స్థానంలో అక్కడి నుంచి ఇక్కడకు జాయిన్ కావడానికి కార్యదర్శులు ఎవరైనా వస్తే, ఇక్కడి వారిని రిలీవ్ చేస్తామన్నారు.

## పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జగన్నాథరావు

అనకాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు కోరారు. మంగళవారం స్థానిక నెహ్రూచౌక్ వద్ద అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పెన్షనర్స్ ఆద్యుడు దివంగత డి.ఎస్.నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ బిల్లు అమలులోకి వస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోయే అవకాశం ఉందని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బి.ఎల్.ఎస్.శర్మ, గౌరవాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు, విశ్రాంత డీఈవో కె.వి. గౌరీపతి, సభ్యులు సత్యం మాస్టార్, బల్లా నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో..

- నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు ఇవ్వడంలోనూ నిర్లక్ష్యమే
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మలసాల భరత్‌కుమార్



స్పౌజ్ పింఛన్ రాలేదని మలసాల భరత్‌కుమార్‌కు గోడు చెప్పుకుంటున్న నూకరత్నం

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు కొంతమందికి ఇచ్చామని, ఇంతలో సార్వత్రిక ఎన్నికలు తర్వాత ఏర్పడిన కూటమి ప్రభుత్వం నేటికీ అందజేయలేదని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ విమర్శించారు. స్థానిక గాంధీబొమ్మ జంక్షన్ నుంచి పెరుగుబజార్ జంక్షన్ వరకూ రహదారి విస్తరణ పనులు తక్షణమే చేపట్టాలని కోరుతూ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 84వ వార్డు ఇన్‌చార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రూ.3 కోట్లతో రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారన్నారు. దీనికి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. రోడ్డు విస్తరణలో ఛిన్నాభిన్నంగా ఉన్న విద్యుత్ లైన్లు పూర్తిస్థాయిలో పునరుద్ధరించారన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆగిపోయిన పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దాంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ రహదారిలో కోట్లాది రూపాయలు వ్యాపార లావాదేవీలు జరుగుతాయన్నారు. రెండేళ్లుగా రహదారి గోతులుమయం కావడంతో వర్షపు నీరు చేరి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారన్నారు. దుమ్ము, ధూళి పెరిగిపోయి స్థానికులు వ్యాధులు బారినపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజకీయాలకు అతీతంగా రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు. నిత్యం వేలాది మంది వాహనదారులు, ప్రజలు అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు, వ్యాపారాలకు ఈ రహదారి నుంచి రాకపోకలు సాగిస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వివిధ ప్రభుత్వ శాఖల్లో పేద యువతకు కాంట్రాక్టు ఉద్యోగావకాశాలు కల్పిస్తే, కూటమి పాలనలో తొలగించడం అన్యాయమన్నారు. అనంతరం అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నేత కరణం సతీష్ జన్మదినం పురస్కరించుకుని కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అంతకుముందు గాంధీబొమ్మ జంక్షన్ వద్ద మరిడిమాంబ అమ్మవారిని దర్శించుకుని, గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, 80వ వార్డు ఇన్‌చార్జ్ కె.ఎం.నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు దాడి నారాయణరావు, మరిపల్లి శోభ, లక్ష్మి, రాము, తదితరులు పాల్గొన్నారు.

**పైడితల్లమ్మకు పూజలు**

స్థానిక జాతీయ రహదారి జీవీఎంసీ విలీన గ్రామం కొప్పాకలో పైడితల్లమ్మ పండగను పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### స్పౌజ్ పింఛన్ ఇవ్వడం లేదు

నా భర్త త్రినాథ్ గతేడాది సెప్టెంబర్ 17వ తేదీన అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త చనిపోయినట్లయితే అతని పింఛన్ భార్యకు తక్షణమే ఇస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నేటి వరకూ అమలు చేయలేదు. ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్న నాకు స్పౌజ్ పింఛన్ ఇవ్వడం లేదు.

– ఎం. నూకరత్నం, గాంధీ బొమ్మ జంక్షన్ రహదారి, అనకాపల్లి

### తల్లికి వందనం నగదు ఒక్కరికే ఇచ్చారు



నా పెద్ద కుమారుడు మురళీ, లక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పాపకు మాత్రమే తల్లికి వందనం నగదు జమ అయింది. భీమునిగుమ్మం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్న రక్షిత సాయికి నగదు ఇవ్వాలి. ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పి మోసం చేశారు.

– చీపురుపల్లి లక్ష్మి, గాంధీబొమ్మ జంక్షన్, అనకాపల్లి